26-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - పరస్పరం ఆత్మిక సోదరులుగా భావిస్తూ ఒకరి పట్ల ఒకరు ఆత్మిక ప్రేమను ఉంచండి, సతోప్రధానముగా అవ్వాలంటే ఎవరి లోపాలనూ ఎంచకండి"

ప్రశ్న:- ఏ ఆధారముపై తండ్రి నుండి పదమాల వారసత్వాన్ని తీసుకోగలుగుతారు?

జవాబు:- తండ్రి నుండి పదమాల వారసత్వాన్ని తీసుకునేందుకు స్మృతి యాత్రలో ఉండండి. ఒక్క తండ్రి తప్ప మిగిలిన విషయాలన్నింటినీ మర్చిపోతూ వెళ్ళండి. ఫలానావారు ఇలా చేస్తారు, వారు ఇలా ఉన్నారు... ఈ విషయాలలో సమయాన్ని వృథా చేసుకోకండి. గమ్యం చాలా పెద్దది, అందుకే సదా సతోప్రధానముగా అయ్యే లక్ష్యము ఉండాలి. తండ్రి ప్రేమలో అతుక్కొని ఉండండి, మీ సూక్ష్మ చెకింగ్ ను చేసుకుంటూ ఉండండి, అప్పుడు పూర్తి వారసత్వాన్ని తీసుకోగలుగుతారు.

ఓంశాంతి. ఇప్పుడు పిల్లలైన మీరు ఎవరైతే కూర్చున్నారో వారికి, అనంతమైన తండ్రి మళ్ళీ సతోప్రధానముగా తయారుచేస్తున్నారు అని తెలుసు. ముఖ్యమైన యుక్తి ఏమి తెలియజేస్తున్నారంటే - పరస్పరం ఆత్మిక సోదరులుగా భావించండి. ముఖ్యమైన శిక్షణ ఏమిస్తున్నారంటే - మీకు పరస్పరం చాలా-చాలా ఆత్మిక ప్రేమ ఉండాలి. ఇంతకుముందు మీకు ఉండేది, ఇప్పుడు లేదు. మూలవతనములో ఈ ప్రేమ అనే విషయము ఉండదు. అనంతమైన తండ్రి వచ్చి శిక్షణను ఇస్తున్నారు - పిల్లలూ, ఇవాళ-రేపు అని అంటూ-అంటూ సమయం గడిచిపోతూ ఉంది, రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతూ ఉన్నాయి. తండ్రి అంటున్నారు - మీరు ఈ లక్ష్మీ-నారాయణుల వలె ఉండేవారు, మిమ్మల్ని ఆ విధంగా ఎవరు తయారుచేసారు? తండ్రి. మీరు కిందకు ఎలా దిగారు అన్నది కూడా తండ్రి తెలియజేశారు. పై నుండి కిందకు దిగుతూ, దిగుతూ సమయం గతించిపోతూ ఉంది, ఆ రోజులు పోయాయి, నెలలు పోయాయి, సంవత్సరాలూ పోయాయి, సమయమూ పోయింది. మొట్టమొదట మనం సతోప్రధానముగా ఉండేవారమని, మనకు పరస్పరం ఎంతో ప్రేమ ఉండేదని మీకు తెలుసు. సోదరులైన మీకు పరస్పరం ఎంతో ప్రేమ ఉండాలి అని తండ్రి సోదరులైన మీ అందరికీ శిక్షణను ఇచ్చారు. నేను మీ తండ్రిని. ఎంత ప్రేమగా నేను మిమ్మల్ని సంభాళిస్తాను. మిమ్మల్ని తమోప్రధానము నుండి సతోప్రధానముగా చేస్తాను. సతోప్రధానులుగా అవ్వడమే మీ లక్ష్యము-ఉద్దేశ్యము. ఎంతెంతగా మనము సతోప్రధానముగా అవుతూ ఉంటామో, అంతంతగా సంతోషములోకి వస్తూ ఉంటాము అని మీరు భావిస్తారు. మనం సతోప్రధానముగా ఉండేవారము, సోదరులమైన మనం పరస్పరం ఎంతో ప్రేమగా ఉండేవారము. దేవతలమైన మనం పరస్పరం ఎంతో ప్రేమగా నడుచుకునేవారమని ఇప్పుడు బాబా ద్వారా మనకు తెలిసింది. ఈ దేవతలకు మరియు స్వర్గానికి ఎంతో మహిమ ఉంది. మీరు కూడా ఆ స్వర్గ వాసులుగానే ఉండేవారు. మళ్ళీ ఇవాళ-రేపు అని అంటూ కిందకు వస్తూ ఉండేవారు. ఒకటవ తారీఖు నుండి ఈ రోజున 5,000 సంవత్సరాలకు ఇంకా కొన్ని సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ప్రారంభం నుండి మీరు ఏ విధంగా పాత్రను అభినయిస్తూ వచ్చారు అనేదంతా మీ బుద్ధిలో ఉంది. ఇప్పుడు దేహాభిమానం ఉన్న కారణముగా పరస్పరం ఒకరి పట్ల ఒకరికి ఆ ప్రేమ లేదు. ఫలానావారు ఇలా ఉన్నారు... అని పరస్పరం లోపాలను ఎంచుతూ ఉంటారు. దేహీ-అభిమానులుగా ఉన్నప్పుడు ఈ విధంగా ఎవరి లోపాలను ఎంచేవారు కారు, పరస్పరం ఎంతో ప్రేమ ఉండేది. ఇప్పుడు మళ్ళీ అదే అవస్థను ధారణ చేయాలి. ఇక్కడైతే ఒకరినొకరు ఆ దృష్టితోనే చూసుకుంటూ ఉంటారు కావున పరస్పరం కొట్లాడుకుంటూ ఉంటారు. మరి అది ఎలా సమాప్తమవ్వాలి? తండ్రి అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, మీరే సతోప్రధానముగా, పూజ్య దేవీ-దేవతలుగా ఉండేవారు, ఆ తర్వాత మెల్లమెల్లగా కింద పడుతూ మీరు తమోప్రధానముగా అయ్యారు. మీరు ఎంత మధురముగా ఉండేవారు. ఇప్పుడు మళ్ళీ ఆ విధంగా మధురముగా అవ్వండి. మీరు సుఖవంతులుగా ఉండేవారు, ఇప్పుడు దుఃఖాన్ని ఇచ్చేవారిగా అయ్యారు. రావణ రాజ్యములో ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటూ కామ ఖడ్గాన్ని ఉపయోగించడం మొదలుపెట్టారు. సతోప్రధానముగా ఉన్నప్పుడు కామ ఖడ్గాన్ని ఉపయోగించేవారు కాదు. మీ ఈ పంచ వికారాలు ఎంత పెద్ద శత్రువులు. ఇదంతా వికారీ ప్రపంచము. రామ రాజ్యం అని దేనినంటారు మరియు రావణ రాజ్యం అని దేనినంటారు అనేది కూడా మీకు తెలుసు. ఇవాళ-రేపు అని అంటూ సత్య, త్రేతా, ద్వాపరయుగాలు పూర్తయిపోయాయి. ఇప్పుడు కలియుగము కూడా పూర్తవనున్నది. మీరే సతోప్రధానము నుండి తమోప్రధానముగా అయిపోయారు. మీ ఆత్మిక సంతోషము మాయమైపోయింది. మీ ఆయుష్షు కూడా తగ్గిపోయింది. ఇప్పుడు నేను వచ్చాను, తప్పకుండా మిమ్మల్ని సతోప్రధానముగా తయారుచేస్తాను. పతిత-పావనా రండి, అని మీరే పిలిచారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు, 5000 సంవత్సరాల తర్వాత ఎప్పుడైతే సంగమయుగము వస్తుందో అప్పుడే నేను వస్తాను.

ఇప్పుడు మీరు స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. ఎంతగా స్మృతి చేస్తారో, అంతగా మీ లోపాలు తొలగిపోతూ ఉంటాయి. మీరు ఎప్పుడైతే సతోప్రధానముగా ఉండేవారో, అప్పుడు మీలో ఎటువంటి లోపాలూ ఉండేవి కావు. మీరు స్వయాన్ని దేవీ-దేవతలుగా పిలుచుకునేవారు. ఇప్పుడు మరి ఆ లోపాలు ఎలా తొలగాలి? ఆత్మకే అశాంతి కలుగుతుంది. ఇప్పుడు స్వయాన్ని చెక్ చేసుకోవాలి - మేము అశాంతిగా ఎందుకు అయ్యాము? మనం సోదరులుగా ఉన్నప్పుడు మనకు ఎంతో ప్రేమ ఉండేది. ఇప్పుడు మళ్ళీ ఆ తండ్రే వచ్చారు. వారు అంటారు, పరస్పరం ఆత్మిక సోదరులుగా భావించండి, ఒకరి పట్ల ఒకరు ప్రేమను ఉంచండి. దేహాభిమానంలోకి రావడం ద్వారా ఒకరి లోపాలను ఒకరు ఎంచుతారు. తండ్రి అంటారు - ఉన్నత పదవిని పొందేందుకు మీరు మీ పురుషార్థాన్ని చేయండి. తండ్రి మనకు ఎటువంటి వారసత్వాన్ని ఇచ్చారంటే, దాని ద్వారా వారు మనల్ని సంపన్నముగా చేసారు అని మీకు తెలుసు. ఇప్పుడు మళ్ళీ ఆ తండ్రి వచ్చి ఉన్నారు కావున మనం వారి మతముపై నడుస్తూ మళ్ళీ పూర్తి వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు? మనమే దేవతలుగా ఉండేవారము, మళ్ళీ 84 జన్మలు తీసుకున్నాము.

మధురాతి-మధురమైన పిల్లలైన మీరు ఎంత స్థిరంగా ఉండేవారు, ఎటువంటి అభిప్రాయ భేదాలూ ఉండేవి కావు, ఎవరినీ నిందించేవారు కారు. ఇప్పుడు ఏవో కొన్ని లోపాలు ఉన్నాయి, వాటన్నింటినీ తొలగించి వేయాలి. మనమందరమూ సోదరులము. ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. మేము సతోప్రధానముగా అవ్వాలి అన్న ఈ ఒక్క చింతయే ఉంది. ఫలానావారు ఇలా ఉన్నారు, వీరు ఇలా చేసారు - అన్న ఈ విషయాలన్నింటినీ మర్చిపోవాలి. తండ్రి అంటున్నారు - వీటన్నింటినీ వదిలివేయండి, స్వయాన్ని ఆత్మగా భావించండి. ఇప్పుడు ఇక సతోప్రధానముగా అయ్యేందుకు పురుషార్థము చేయండి. దేహాభిమానములోకి రావడం వలనే అవగుణాలను చూడడం జరుగుతుంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. పరస్పరం సోదరులుగా చూసినప్పుడు అందరిలోనూ గుణాలే గుణాలు కనిపిస్తాయి. ఎవరైనా అలా-ఇలా ఏమైనా చేసినా కానీ, అందరినీ గుణవంతులుగా తయారుచేసేందుకే ప్రయత్నించండి. వీరు తమోప్రధానముగా లేక రజోప్రధానముగా ఉన్నారు, అందుకే వారి నడవడిక అలా ఉంటుంది అని భావించడం జరుగుతుంది. అందరి కంటే ఎక్కువ గుణాలు తండ్రిలోనే ఉన్నాయి. కావున తండ్రి నుండే గుణాలను ధారణ చేయండి, మిగిలిన విషయాలన్నింటినీ వదిలివేయండి. అవగుణాలను వదిలి గుణాలను ధారణ చేయండి. తండ్రి ఎంత గుణవంతులుగా తయారుచేస్తారు. వారు అంటారు, పిల్లలైన మీరు కూడా నా సమానముగా గుణవంతులుగా తయారవ్వాలి. తండ్రి సుఖాన్ని ఇచ్చేవారు. మనము కూడా సుఖాన్ని ఇచ్చేవారిగా అవ్వాలి. మేము సతోప్రధానముగా అవ్వాలి అన్న ఒక్క చింతయే ఉండాలి, అంతే. వేరే ఏ విషయాలను వినకండి, అలాగే నిందించకండి. అందరిలోనూ ఏవో కొన్ని లోపాలు ఉన్నాయి. ఆ లోపాలు కూడా ఎవరూ అర్థం చేసుకోలేని విధంగా ఉన్నాయి. వీరిలో లోపాలు ఉన్నాయి అని ఇతరులు అర్థం చేసుకుంటారు కానీ వారు స్వయాన్ని చాలా మంచివారిగా భావిస్తారు. కానీ ఎక్కడో అక్కడ తప్పుడు మాటలు వచ్చేస్తాయి. సతోప్రధాన అవస్థలో ఇటువంటి విషయాలు ఉండవు. ఇక్కడ లోపాలు ఉన్నాయి కానీ అది అర్థం చేసుకోని కారణముగా స్వయాన్ని అన్నీ తెలిసినవారిగా భావిస్తూ కూర్చున్నారు. తండ్రి అంటున్నారు, అన్నీ తెలిసినవాడిని నేనొక్కడినే, నేను మిమ్మల్నందరినీ మధురముగా తయారుచేయడానికి వచ్చాను. ఇక అవగుణాలు మొదలైనవన్నీ వదిలివేయండి. మీ నాడిని కూడా చూసుకోండి - నేను ఎంతగా మధురాతి-మధురమైన ఆత్మిక తండ్రిని ప్రేమగా స్మృతి చేస్తున్నాను? నేను ఎంతగా స్వయం అర్థం చేసుకుంటున్నాను మరియు ఇతరులకు అర్థం చేయిస్తున్నాను? దేహాభిమానంలోకి వస్తే ఏ లాభమూ లేదు. ప్రపంచం తమోప్రధానముగా ఉంది అన్న ఈ ముఖ్యమైన విషయాన్నే అర్థం చేయించాలి. సతోప్రధానముగా ఉన్నప్పుడు దేవతల రాజ్యం ఉండేది. ఇప్పుడు 84 జన్మలను అనుభవించి తమోప్రధానముగా అయ్యారు, ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. తమోప్రధానముగా కూడా భారతవాసులే అయ్యారు మరియు సతోప్రధానముగా కూడా వారే అవుతారు. ఇంకెవ్వరినీ సతోప్రధానులు అని అనలేరు. సత్యయుగములో ఏ ధర్మమూ ఉండదు. తండ్రి అంటారు - మీరు అనేక సార్లు తమోప్రధానము నుండి సతోప్రధానముగా అయ్యారు, ఇప్పుడు మళ్ళీ అలా అవ్వండి. శ్రీమతముపై నడుస్తూ నన్ను స్మృతి చేయండి. ఈ చింతయే ఉండాలి. శిరస్సుపై పాపాలు ఎన్నో ఉన్నాయి, తండ్రి ఇప్పుడు సుజాగృతులుగా చేసారు. దేవతల ఎదురుగా వెళ్ళి - మేము వికారులము అని అంటారు ఎందుకంటే దేవతలలో పవిత్రత యొక్క ఆకర్షణ ఉంటుంది, అందుకే వారి ఎదురుగా వెళ్ళి అలా అంటారు, మళ్ళీ ఇంటికి వెళ్ళి మర్చిపోతారు. దేవతల ఎదురుగా వెళ్ళినప్పుడు తమపై తమకు ద్వేషం కలుగుతుంది. ఇంటికి వెళ్ళాక ఏ ద్వేషమూ ఉండదు. వారిని అలా తయారుచేసేవారు ఎవరు? అన్న ఆలోచన కూడా చెయ్యరు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - దేవతలుగా అవ్వాలంటే ఈ చదువును తప్పకుండా చదవండి. శ్రీమతముపై నడవవలసి ఉంటుంది. మొట్టమొదట తండ్రి అంటున్నారు - స్వయాన్ని సతోప్రధానముగా తయారుచేసుకోవాలి, అందుకే నన్నొక్కరినే స్మృతి చేయండి, ఇంకెటువంటి పరచింతన విషయాలను మాట్లాడకండి.

నేను ఈ విధంగా అవ్వాలి అని మీ విషయములో మీరు చింత పెట్టుకోండి. తండ్రి అంటున్నారు - మీరే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మమువారిగా ఉండేవారు, తర్వాత ఎక్కడికి వెళ్ళారు. వీరి 84 జన్మల కథయే వ్రాయబడి ఉంది. ఇప్పుడు మనం ఈ విధంగా అవ్వాలి, దైవీ గుణాలను ధారణ చేయాలి, పరస్పరం సోదరులుగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి, తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి. నింద, స్తుతి అయితే చేస్తూనే వచ్చారు అని బుద్ధిలోకి రావాలి. వాస్తవానికి స్తుతి అనేది లేనే లేదు, అంతా నిందయే. ఎవరినైతే ఒక వైపు మహిమ చేస్తారో, వారిని ఇంకొక వైపు నింద కూడా చేస్తారు ఎందుకంటే వారి గురించి తెలియనే తెలియదు. ఒక వైపు తండ్రి మహిమను చేస్తారు, ఇంకొక వైపు సర్వవ్యాపి అని అంటారు. రాయి-రప్పలలోనూ పరమాత్మ ఉన్నారు అని అనడం వలన విముఖులుగా అయిపోయారు. వినాశన కాలములో విపరీత విముఖ బుద్ధి కలవారు వినాశనమవుతారు, వినాశన కాలములో ప్రీతి గల సమ్ముఖ బుద్ధి కలవారు విజయాన్ని పొందుతారు.

ఎంత వీలైతే అంత తండ్రిని స్మృతి చేసే ప్రయత్నం చేయాలి. ఇంతకుముందు కూడా స్మృతి చేసేవారు కానీ అది వ్యభిచారీ స్మృతిగా ఉండేది. అనేకులను స్మృతి చేసేవారు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - అవ్యభిచారీ స్మృతిలో ఉండండి. కేవలం నన్నొక్కరినే స్మృతి చేయండి. భక్తి మార్గపు లెక్కలేనన్ని చిత్రాలు ఉన్నాయి. వాటిని కూడా మీరు స్మృతి చేస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. అక్కడ స్మృతి చేయవలసి వచ్చేందుకు అసలు భక్తి మార్గమే లేదు. తండ్రి అంటున్నారు - నేను సతోప్రధానముగా ఎలా అవ్వాలి? అన్న ఒక్క చింతయే పెట్టుకోండి. ఈ సృష్టి చక్రము ఎలా తిరుగుతుంది? అన్న జ్ఞానం లభించింది. అది సహజము. అచ్ఛా, ఎవరైనా నోటితో అర్థం చేయించలేకపోయినా కానీ, మేము సతోప్రధానుల నుండి తమోప్రధానులుగా ఎలా అయ్యాము అన్నది బుద్ధిలోకి తప్పకుండా వస్తుంది. ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా తప్పకుండా అవ్వాలి. ఒకవేళ ఎవరైనా చెప్పలేకపోతే ఇక అది వారి భాగ్యము అని అనడం జరుగుతుంది. విధి కూడా అలా ఉంది. తండ్రి చాలా సహజమైన ఉపాయాన్ని తెలియజేశారు - వీరు అనంతమైన తండ్రి, వీరి నుండే వారసత్వము లభిస్తుంది అని బ్యాడ్జ్ ద్వారా అర్థం చేయించడం సహజము. తండ్రి తప్పకుండా స్వర్గ స్థాపనను చేస్తారు. దానిని తప్పకుండా ఇక్కడే చేస్తారు. శివజయంతి అనగా స్వర్గ జయంతి. స్వర్గములో దేవీ-దేవతలు ఉంటారు, వారు మళ్ళీ అలా ఎలా తయారవుతారు? వారు ఈ పురుషోత్తమ సంగమయుగములో చదువు ద్వారా అలా అయ్యారు. పిల్లలైన మీకు కూడా వివేకం లభించింది, మళ్ళీ ఇతరులకు కూడా ఈ వివేకాన్ని అందించాలి. మీది సహజ జ్ఞానము మరియు సహజ యోగము, సహజ వారసత్వము. కానీ ఇక్కడ పైస అంత విలువ చేసే వారసత్వాన్ని తీసుకునేవారు కూడా ఉన్నారు, అలాగే పదమాల వారసత్వాన్ని తీసుకునేవారు కూడా ఉన్నారు. మొత్తం ఆధారమంతా చదువుపైనే ఉంది. స్మృతియాత్ర ద్వారా మిగిలిన విషయాలన్నింటినీ మర్చిపోండి. ఫలానావారు ఇలా ఉన్నారు... అనే ఈ విషయాలలో సమయాన్ని వృధా చేసుకోకండి. గమ్యము చాలా పెద్దది. సతోప్రధానముగా అవ్వడంలోనే మాయ విఘ్నాలను కలిగిస్తుంది. చదువులో విఘ్నాలు కలగవు. తండ్రి అంటున్నారు - స్వయాన్ని చూసుకోండి - నాలో ఎంత ప్రేమ ఉంది? ఆ ప్రేమ ఎలా ఉండాలంటే, ఇక తండ్రిని అతుక్కుని ఉండాలి. నేర్పించేవారు తండ్రే. ఇతని ఆత్మ నేర్పించదు, ఇతను కూడా నేర్చుకుంటారు. బాబా, మీరు మమ్మల్ని ఎంత వివేకవంతులుగా తయారుచేస్తారు. ఉన్నతోన్నతులైతే మీరే, మళ్ళీ మనుష్య సృష్టిలో కూడా మీరు మమ్మల్ని ఎంత ఉన్నతులుగా తయారుచేస్తారు. ఈ విధంగా లోలోపల బాబా మహిమను చేయాలి. బాబా, మీరు ఎంత అద్భుతాన్ని చేస్తారు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు మళ్ళీ మీ రాజ్యాన్ని తీసుకోండి, సంతోషంగా నన్నొక్కరినే స్మృతి చేయండి. స్వయాన్ని ప్రశ్నించుకోవాలి - నేను బాబాను ఎంతగా స్మృతి చేస్తున్నాను. సంతోషమంతటి ఔషధం లేదు అని అంటారు. కావున తండ్రిని కలుసుకునే సంతోషం కూడా ఉంది, కానీ అంతటి సంతోషం పిల్లలలో ఉండడం లేదు. నిజానికి చాలా సంతోషము ఉండాలి అని వివేకం చెప్తుంది. ఈ చదువు ద్వారా మనం ఈ రాజులుగా అవ్వనున్నాము. మనం అనంతమైన తండ్రికి పిల్లలము. సుప్రీమ్ తండ్రి మనల్ని చదివిస్తున్నారు. బాబా ఎంతటి దయార్ద్ర హృదయులు, వారు కూర్చొని పిల్లలైన మీకు ఏ విధంగా కొత్త, కొత్త విషయాలను వినిపిస్తున్నారో చూడండి. ఇప్పుడు మీ బుద్ధిలో చాలా కొత్త-కొత్త విషయాలు ఉన్నాయి, ఇవి ఇంకెవ్వరి బుద్ధిలోనూ లేవు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. దేహీ-అభిమానీ అవస్థను ధారణ చేసి సుఖాన్ని ఇచ్చేవారిగా అవ్వాలి. ఎవరి లోపాలనూ ఎంచకూడదు. పరస్పరం

చాలా-చాలా ప్రేమగా ఉండాలి, అభిప్రాయ భేదాలలోకి రాకూడదు.

2. ఇతర విషయాలన్నింటినీ వదిలి ఒక్క తండ్రి నుండే గుణాలను గ్రహించాలి. సతోప్రధానముగా అవ్వాలి అన్న చింతను ఉంచుకోవాలి. ఎవరి విషయాలనూ వినకూడదు, అలాగే నిందించకూడదు. అన్నీ తెలిసినవారము అని అనుకోకూడదు.

వరదానము:- సమయమనుసారముగా స్వయాన్ని చెక్ చేసుకుని చేంజ్ చేసుకునే సదా విజయీ శ్రేష్ఠ ఆత్మా భవ

ఎవరైతే సత్యమైన రాజయోగులో, వారు ఎప్పుడూ ఎటువంటి పరిస్థితిలోనూ డిస్టర్బ్ అవ్వరు. కావున స్వయాన్ని సమయమనుసారముగా ఈ విధముగా చెక్ చేసుకోండి మరియు చెక్ చేసుకున్న తరువాత చేంజ్ చేసుకోండి. కేవలం చెకింగ్ మాత్రమే చేసుకుంటే నిరాశకు లోనవుతారు. మాలో ఈ లోపము కూడా ఉంది, ఇది పోతుందో లేదో అని అలోచిస్తుంటారు. అందుకే చెక్ చేసుకోండి మరియు చేంజ్ చేసుకోండి ఎందుకంటే సమయమనుసారముగా కర్తవ్యాన్ని చేసేవారు సదా విజయాన్ని పొందుతారు, అందుకే సదా విజయీ శ్రేష్ఠ ఆత్మగా అయ్యి తీవ్ర పురుషార్థము ద్వారా నంబరు వన్ లోకి వచ్చేయండి.

స్లోగన్:- మనస్సును-బుద్ధిని కంట్రోల్ చేసే అభ్యాసము ఉండాలి, అప్పుడు క్షణములో విదేహులుగా అవ్వగలరు.